క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణాభివృద్ధిలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు అన్నారు. జంగారెడ్డిగూడెంలో 8వ వార్డు, 9వ వార్డును కలిపే మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మాణం చేస్తున్నారు. ఈ పనులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.5 లక్షల వ్యయంతో 8వ వార్డులోని లాగు యోహాను ఇంటి వద్ద నుంచి 9వ వార్డు బాలాజీ టౌన్‌షిప్ వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. రోడ్డు నాణ్యత తదితర విషయాలను పరిశీలించి, కాంట్రాక్టర్‌కు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న పాల్గొన్నారు.

పేదల కంటికి వెలుగు


కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి : కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పేదల జీవితాల్లో వెలుగు నింపే అవకాశం కలిగిందని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వైద్యాధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హుస్సేన్ మాట్లాడుతూ 60 ఏళ్ల పైబడిన వారికి గ్రామాల్లో దృష్టిలోపాలను పరీక్షించి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని దృష్టి సమస్యలను తొలగించుకోవాలన్నారు. ఇప్పటివరకు ప్రగడవరంలో 460 మందిని, తిమ్మిరెడ్డిపల్లిలో 50 మందిని, వెలగలపల్లిలో 160 మందిని పరీక్షించినట్లు ఆప్తాలమిక్ అసిస్టెంట్ ఆశాజ్యోతి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఆరోగ్య కార్యకర్త కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలికల హైస్కూల్లో ప్రేరణ తరగతులు


లక్ష్యసాధనపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న నైపుణ్యాలను వెలికితీసి, భవిష్యత్ లక్ష్యాల సాధనకు వినియోగించుకోవాలని పడాల చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర్య ప్రసాద్ అన్నారు. చింతలపూడి బాలికల హైస్కూల్ హెచ్ఎం మాటూరి చక్రధరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రీసోర్స్ పర్సన్ బృందం సహాయంతో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో ప్రేరణ కల్పించి, భవిష్యత్ లక్ష్యాల సాధనకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్ఎస్ఎస్ (స్వేచ్ఛ, సేతు, సెట్) ద్వారా వాస్తవ జీవన కథల ద్వారా విద్యార్థులు లక్ష్యాలను ఎలా చేధించాలో తెలియజేశారు. కార్యక్రమంలో కస్తూరి ఫౌండేషన్ బండి శ్రీకాంత్, ఉపాధ్యాయులు విజయానంద్, శ్రీను, చార్లెస్, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

నూకాలమ్మ ఆలయంలో విశేష పూజలు


ఆలయంలో శ్రీమహావిద్యా వనదుర్గ దశావరణ యంత్ర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : శ్రీ చక్ర సహిత శ్రీ నూకాలమ్మ అమ్మవారి దివ్య ఆలయంలో ఆషాఢ మాసంలో సోమావతి అమావాస్యను పురస్కరించుకొని విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపం మధ్యలో శ్రీ మహావిద్యా దశావరణ యంత్రాన్ని అలంకరించి, లోక కల్యాణం కోసం విశేష హారతి పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రొంగల నాగేశ్వరావు, చిట్లూరి సర్వేశ్వరరావు, నూకల సత్యనారాయణ, ముత్యాలరావు, చింతకాయల అచ్చిరాజు, చిట్లూరి సుబ్బారావు, ఆలయ మేనేజర్ చిటికెల రాంబాబు, మహిళలు, నూకాంబిక సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో..



నా పేరు షేక్ వలీబాబు. రామయ్యపేట సచివాలయం – 3 వలంటీర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నా పరిధిలోని 50 కుటుంబాల్లో ప్రతి ఒక్కరికి లబ్ధిచేకూరేలా కృషి చేస్తున్నాను. కరోనా సమయంలో కూడా సక్రమంగా పింఛన్లు పంపిణీ చేశాను. వరదల సమయంలో పాత పోలవరం ప్రాంతంలో ఇళ్లల్లోని ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకున్నప్పుడు వారికి సహాయాన్ని అందించాను. ఇళ్లల్లోని సామాగ్రి భద్రపరచడంలో, వృద్ధులను పునరావాస కేంద్రాలకు తరలించడంలో సహాయం చేశాను. భోజన వసతి ప్రదేశంలో కూడా పనిచేశాను. ఇదంతా పూర్తిస్థాయి సేవా దృక్పథంతోనే చేశాను.

వలంటీర్ల సేవలు వెలకట్టలేం


రామారెడ్డికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుబ్రహ్మణ్యం

నాపేరు దల్లి రామిరెడ్డి, జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామం. నేను అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ సమయంలో ఎటూ కదలలేని పరిస్థితి. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ నగదును వలంటీర్ బాకి సుబ్రహ్మణ్యం గుంటూరు వచ్చి నాకు అందించారు. ఆ సమయంలో నాకు ఎంతో ఆనందం కలిగింది. గతంలో దూరంగా ఉండే కార్యాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఇంటికే పింఛన్ తీసుకొచ్చి ఇచ్చేలా వలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి.

మాలో ఒకరిగా మెలుగుతూ..



గత ప్రభుత్వాల సమయంలో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. పనులు పూర్తవుతాయో లేదో కూడా తెలియదు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా ప్రతి పథకం లబ్ధిని నేరుగా ఇంటికే అందిస్తున్నారు. మా వలంటీర్ షేక్ అంజుని మాలో ఒకరిగా మెలుగుతూ మాకు చేదోడుగా ఉంటోంది. మాకు ప్రతి పథకాన్ని వివరించి లబ్ధి చేకూరుస్తుంది. వలంటీర్ వ్యవస్థను అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. మరోసారి సీఎంగా ఆయన గెలుపుకోసం నా వంతు కృషిచేస్తా.

– కొత్తూరి సుబ్బలక్ష్మి, 6వ వార్డు, జంగారెడ్డిగూడెం

జగనన్న సురక్షతో నూరుశాతం సంక్షేమ లబ్ధి


బుట్టాయగూడెం : సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు


ద్వారకాతిరుమల : గొల్లగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి


లింగపాలెం : సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

బుట్టాయగూడెం : నూటికి నూరు శాతం పేదలందరికీ నవరత్నాల సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని దొరమామిడి –1 సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. సర్పంచ్ తెల్లం రాముడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, తహసీల్దార్ ఎస్.శారా శాంతి, ఈఓపీఆర్‌డీ ఎం. శ్రీహరి, మండల వ్యవసాయాధికారి బి.సుమలత, హౌసింగ్ ఏఈ మణికంఠ, పార్టీ నాయకులు కాలింగి వెంకటేశ్వరరావు, చింతలపూడి వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాల తనిఖీ

మండలంలోని దొరమామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయుడు మొడియం గంగరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని గిరిజన విద్యార్థులు ఉన్నత చదువుల్లో ముందుకు సాగాలని అన్నారు.

జగనన్న సురక్ష.. ఓ సేవా యజ్ఞం

ద్వారకాతిరుమల : అర్హులందరికీ అండగా నిలిచే సేవాయజ్ఞమే జగనన్న సురక్ష అని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని గొల్లగూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు కుల, ఆదాయం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, సర్పంచ్ బొండాడ నాగభూషణం, ఎంపీటీసీ చవటపల్లి మౌనిక, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, జేపీ కృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, జిత్తుక శ్రీను, గుర్రాల లక్ష్మణ్, నల్లంటి రామారావు, తహసీల్దార్ పి.సతీష్, ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్ తదితరులున్నారు.

సురక్షతో నూరుశాతం ప్రభుత్వ సేవలు

లింగపాలెం : జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు నూరుశాతం ప్రభుత్వ సేవలు అందినట్లయిందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మంగళవారం లింగపాలెంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకే పౌరసేవలు అందుతున్నాయన్నారు. అనంతరం అర్హులకు ఎమ్మెల్యే ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తగరం హేమలత, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ఎంపీటీసీ భీమిరెడ్డి స్వరూప ప్రభాకరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ఏఎంసీ డైరెక్టర్ కె రామకృష్ణ, మండల ప్రత్యేకాధికారి ఏపీ ఆర్ గంగాధరబాబు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చింతలపూడి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడి మండలం గణిజర్ల సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. గణిజర్ల గ్రామ సర్పంచ్ బొల్లిన వెంకటరావు, ఉప సర్పంచ్ సొంగ ఉదయ్ కుమార్, ఎంపీటీసీ గోళ్లమూడి రాంబాబు, చింతలపూడి మండల సచివాలయం కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, సచివాలయం కన్వీనర్ బుల్లా దాస్, ఎంపీడీవో మురళీకృష్ణ, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పరింపూడి పంచాయతీ సచివాలయం–03 సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు గొడ్డటి నాగేశ్వరరావు, ఎంపీపీ గంజిమాల రామారావు, సొసైటీ అధ్యక్షులు మంతెన సోమరాజు ఎంపీటీసీలు చింతా శ్రీదేవి, గంట శ్రీను, మండల సచివాలయాల కో–ఆర్డినేటర్ నూకల రాము, పట్టణ పార్టీ ప్రెసిడెంట్ సంకుకొండ, మారిశెట్టి శ్రీనివాస్ చిటికెన నాగార్జున, ఏలేటి భాస్కర్, పూలపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

500 మందికి ధ్రువీకరణ పత్రాల అందజేత

టి.నరసాపురం : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని జెడ్పీటీసీ సామంతపూడి సూర్యనారాయణ రాజు అన్నారు. వల్లంపట్ల సచివాలయం పరిధిలోని మల్లుకుంటలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో 500 మందికి పలు రకాల ధ్రువీకరణ పత్రాలు, కౌలు కార్డులు పంపిణీ చేశారు. పామాయిల్ రైతు ప్రతినిధి తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, ఎంపీటీసీ గాది రాజేంద్రప్రసాద్ రెడ్డి, దోరేపల్లి నరసింహరావు, పులగం వసంతకుమార్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ జేవీ సుబ్బారావు, ఎంపీడీవో మంగాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్క లబ్ధిదారుడిని గుర్తించేందుకే..

జంగారెడ్డిగూడెం : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి కోరారు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ భవనంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్క లబ్ధిదారుడిని గుర్తించి, వారికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని, ఈ క్రమంలో ఇంకా మిగిలిన ఉన్న లబ్ధిదారునికి సైతం పథకాలు అందాలనే జగనన్న సురక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, తహసీల్దార్ స్లీవజోజి, కౌన్సిలర్‌లతో కలిసి ఆమె అందజేశారు. వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, సచివాలయాల కన్వీనర్ చనమాల శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు కాసర తులసీరెడ్డి, నంబూరి రామచంద్రరాజు, ఏవీ రమణమూర్తి, కంచర్ల మురళి, పార్టీ నాయకులు బత్తిన చిన్న, కంచర్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకపాడులో జగనన్న సురక్ష

కుకునూరు : కుకునూరు పంచాయతీ ఇసుకపాడు గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 408 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచ్ రావు మీనా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వారికి సంక్షేమ పథకాలు మరింత చేరువగా తీసుకువచ్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, స్పెషల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, నాయకులు కుచ్చర్లపాటి నరసింహారాజు, రావు వినోద్, మాదిరాజు వెంకన్నబాబు, మల్లయ్య చంటినాయుడు, సూర్ల రాము, మడకం వీరయ్య బుచ్చిబాబు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం : ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


టి.నరసాపురం : ధ్రువీకరణపత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ


జంగారెడ్డిగూడెం: ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న దృశ్యం


కుక్కునూరు : సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

పోగొండ పంట కాల్వల పనులు చేపట్టేలా చర్యలు


ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : పోగొండ రిజర్వాయర్‌కు సంబంధించి కుడి, ఎడమ కాల్వ పనులను ఉపాధి హామీ పథకంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. మండలంలోని దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మైనర్ ఇరిగేషన్ శాఖ, ఉపాధి హామీ పథకం అధికారులతో పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోగొండ కుడి, ఎడమ కాల్వ పనులకు సంబంధించి సుమారు రూ. 40 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని అన్నారు. అలాగే పెద్దవాగు ప్రాజెక్టు ద్వారా రైతుల పంటలకు నీరు అందించేలా సుమారు రూ.44.02 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి మంజూరుకు నివేదికలు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్‌ఈ కె.శ్రీనివాస్, ఈఈ ఎం.రాంబాబు, డీఈఈ పి.ఆనంద్‌కుమార్, పి.వరప్రసాద్, ఏఈ టి.సురేష్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ అలీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న వీరమల్ల మధు తదితరులు

టి.నరసాపురం : ఇటీవల విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రి వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న వెలగపాడు గ్రామానికి చెందిన నరదల కీర్తి కావ్యశ్రీకి మంగళవారం కామవరపుకోట సోషల్ వర్కర్స్ టీమ్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆ టీమ్ సభ్యులు వీరమళ్ల మధు, పెద్దింటి చంటి దాతల నుంచి సేకరించిన రూ.12,300 బాధితురాలికి అందజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం

ఏపుగుంట గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన డొక్కా గంగరాజు కుటుంబానికి మంగళవారం బీజేపీ నాయకులు తపన చౌదరి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని వేగేశ్న సత్రంరాజు ద్వారా అందజేశారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జట్ల రాంబాబు, పార్టీ మండలాధ్యక్షులు మాలంపాటి హరిశ్చంద్రప్రసాద్, కార్యదర్శి రామలింగేశ్వరరావు, మక్కిన శ్యామ్, అడపా వెంకట్రావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మహిళా సమాఖ్య జిల్లా కార్యవర్గం


జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు మొక్కను అందిస్తున్న మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు

ఏలూరు(మెట్రో): మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా నూతన పాలకవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. మహిళా సమాఖ్య సభ్యులు జిల్లాలో మహిళా సంఘాలు చేస్తున్న అభివృద్ధి పనులను, హౌసింగ్ లబ్ధిదారులకు సంఘాల ద్వారా అదనపు రుణాలు ఇప్పించడం, చేయూత, మహిళా మార్ట్, జగనన్న తోడు వంటి పథకాలు గురించి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో చర్చించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా సమాఖ్య పాలకవర్గ అధ్యక్షురాలు డి.పద్మావతి, ఉపాధ్యక్షురాలు జి.జ్యోతి, కార్యదర్శి ఎస్.గొల్లమ్మ, సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకటలక్ష్మి, కోశాధికారి కె.నవత, నూతన సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సీఐ

ఏలూరు 3 టౌన్ సీఐగా కోమకుల శివాజీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కాగా కోమకుల శివాజీ మచిలీపట్నంలో డీసీఆర్‌బీ, ఎస్‌బీ రేంజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఏలూరు 3 టౌన్ సీఐగా బదిలీపై వచ్చారు. ఆయన గతంలో ఏలూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్సైగా కూడా పనిచేశారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు


జెడ్పీ హైస్కూల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి

జంగారెడ్డిగూడెం : పేదలకు ప్రభుత్వం ఇచ్చే నిత్యావసర సరుకులను సక్రమంగా సరఫరా చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. రామచంద్రపురంలోని అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ వాహనాన్ని, ఎంపీపీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. మార్కెట్ యార్డ్ లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆమె తనిఖీ చేశారు. డీలర్లకు ఇచ్చే బియ్యం బస్తాలు తగిన బరువు ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు.

జగనన్న గోరుముద్ద అమలుపై అసంతృప్తి

జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద అమలు తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తంచేశారు. బెల్లం తక్కువ వేయడం వల్ల రాగిజావ ఉప్పగా ఉందని, పులిహోర సరిగా ఉడకలేదని, రుచి, నాణ్యత లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా పాఠశాలలో 1200మంది విద్యార్థులు ఉండగా, 614 మంది మాత్రమే భోజనం చేయడం పట్ల ఉపాధ్యాయులను ప్రశ్నించారు. నాణ్యతతో ఆహారం అందించాలని, లేనిపక్షంలో నిర్వాహకులను మార్పు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాగా తనిఖీలోని అంశాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఆమెతోపాటు జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణ రాజు, ఏఎస్ఓ ప్రతాపరెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ వైవీ లక్ష్మీకుమారి, ఎంఈవో రాములు రెవెన్యూ, పోలీస్, అంగన్‌వాడి, తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వార్షిక తనిఖీ

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం శాఖ గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి యు.శేఖర్‌బాబు మంగళవారం సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన రికార్డులను పరిశీలించి రీడర్స్ సూచనలు సలహాలు తీసుకున్నారు. వేసవి సెలవులలో విద్యార్థులకు నిర్వహించిన ఆటవిడుపు శిక్షణా తరగతులు సత్ఫలితాలను ఇచ్చాయని, మున్ముందు కూడా వీటిని కొనసాగిస్తామని అన్నారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ యు.రాముడు వేసవిశిక్షణా తరగతులలో ఉచిత సేవలందించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, వెటరన్ క్రీడాకారులను పరిచయం చేశారు.

కొయ్యలగూడెంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు


రాజీవ్‌నగర్‌లో విద్యుత్ లైన్‌లను క్రమబద్ధీకరిస్తున్న సిబ్బంది

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం టౌన్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామారావు తెలిపారు. కన్నాపురం రోడ్డులో, అశోక్ నగర్, రాజీవ్ నగర్, చేపల పేట, జూనియర్ కాలేజ్ ప్రాంతాలలో 100 కేవీ నుంచి 60 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయన్నారు. నాలుగు రోజుల వ్యవధిలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు అదేవిధంగా విద్యుత్ లైన్ల క్రమబద్ధీకరణ నిర్వహిస్తామన్నారు. దీనివల్ల విద్యుత్‌లో హై వోల్టేజ్ సమస్య తీరుతుందని తెలిపారు. అదేవిధంగా తాగునీటి సరఫరాకు విద్యుత్ పరంగా అవాంతరాలు ఉండవని అన్నారు.

రేపటి నుంచి మున్సిపల్ వర్కర్ల నిరాహార దీక్షలు

చింతలపూడి : ఈ నెల 20వ తేదీ నుంచి మున్సిపల్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని చింతలపూడి నగర పంచాయతీ కార్మికులు తెలిపారు. మంగళవారం చింతలపూడిలో వారు మాట్లాడుతూ నిరాహార దీక్షలు, ధర్నాలతో పాటు కార్యాలయాల ముట్టడి, కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేపడతామన్నారు. స్థానిక నగర పంచాయతీలో కార్మిక సమస్యలు పరిష్కారం కాక అనేక సంవత్సరాల నుంచి కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి చింతలపూడి నగర పంచాయతీ కార్మికుల సమస్యలపై ఆందోళన, పోరాటాలు చేస్తామని సీఐటీయూ మండల అధ్యక్షుడు నత్త వెంకటేశ్వరావు తెలిపారు. చింతలపూడి నగర పంచాయతీ కార్మికులు వి.పద్మ, కమలకుమారి, జి.నాగరాజు, కె.నాగరాజు ఈ మేరకు మున్సిపల్ అకౌంటెంట్‌కు ధర్నా, నిరాహార దీక్షలకు సంబంధించి వినతిపత్రం అందజేశారు.

పనిభారం తగ్గించాలి

ఏలూరు (టూటౌన్): ఆశావర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదని, పనిభారం తగ్గించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అధికారుల వేధింపులు ఆపాలని ఆశ వర్కర్లు మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్ లింగరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడారు. ఈ మేరకు డీపీఓ. జోషికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా నాయకులు రోజా, లోకేశ్వరి, నాగమణి, కనకదుర్గ తదితరులు నాయకత్వం వహించారు.